

# ౬ కిటుకు

పోబోతున్న సుబ్బరాజుని కేకేశాడు రెడ్డిగారు. చూడు రాజా... చెప్పేంది చిన్న కథ అయినందువల్ల పొద్దుండిపోయింది - ఇంకోటి మనసు కొచ్చిందింతలో. ఇదీ ఆలకించిపో. ఓ రోజు నడక తగ్గినా తగ్గినట్టే అన్నారు. ఇది ఎక్కడో విన్న బాపతు - ఎవరో చదవగాననుకుంటా - నువ్వు వినుంటే తూ నా బొడ్డనుకుందారి అని కథ ఆరంభించారు రెడ్డిగారు.

కొండపాడనే కుగ్రామంలో అచ్చిరెడ్డని ఓ మోతుబరి. రావఁలక్ష్మణుల్లాంటి బిడ్డలిద్దరు. అందులోనే పేచీ వొచ్చింది. తల్లిదండ్రాదు లైతేనేవి, ఊళ్ళో పెద్దా చిన్నా అయితేనేవి రావఁలక్ష్మణులు రావఁలక్ష్మణు లంటూ ఇద్దరిలో పెద్దోణ్ణి రాముడిగానే చూసుకునేవారు. చీటికీ మాటికీ చిన్నోణ్ణి చిన్న చూపే జూసేవారు. పెద్దోడి చురుకుదనవూ, ఆ తేజవూ ఈడికేది అనేవారు. దానా దీనా లక్ష్మణరెడ్డికి జంకేర్పడింది. చదువంటలేదు. బళ్ళోకెళ్తే పెద్దాణ్ణే మెచ్చుకుని తన్ని దిట్టడవేగా అని దోచి, పొలాన గూచుని గొడ్లు దోలుకునేవాడు. చివరికిలా మేదకుడని పేరు స్థిరపడిపోయింది.

కాని వాడు మేదకుడు గాడు మరి. చూస్చూశోనాడు ఊరొదిల్లేచ్చక్కా బోయాడు. పట్నం వెళ్ళి సత్రాలెంటా మటాలెంటా తిరిగి అలాగే గాలికి పెరిగి పెద్దోడయ్యాడు. చివరికి చిన్న కంపెనీలో నౌకరు పనయింది. నాలుగైదేళ్ళయ్యేసరికి ఆడికి ఎటండరు అనే పనిచ్చారు. గుమస్తా కన్నా రెండాకుల్లక్కువనుకో. రెడ్డికి అక్షరమ్ముక్క పోలిక దెలీపోయినా పద్దు ముక్కలు ఫైళ్ళు అయ్యన్నీ గుర్తు తెలిశాయి. అంత చురుకైన బుర్ర మరి. అయినా సదువు సంజె లేనోడికి నాకెందుకీ పెద్ద నౌకరీ అన్నా కంపెనీ పెద్ద సెట్టిగారు ఒప్పుకోలేదు. రెండేళ్ళకి ఆయన పోడంతో ఈడి కష్టాలారంబవయినాయి. కుర్రాయన యజమానయ్యాడు. వ్యాపారం పెరిగింది. కంపెనీ పెద్దదయింది. అనకోనాడు, ఛస్ చదువు రానోడు 'ఎటెండరేట'ని ఎవరో చెప్పారు. సరే మరి కథ యిట్టాగుండాది గాబట్టి నువ్వు మళ్ళీ నౌకరు పనికన్నా దిగి రాలేకపోతే ఇంకో దగ్గిర నౌకరీ జూసుకో అన్చెప్పించారు మేనేజరుచేత. రెడ్డికి మల్లా ఆ కంపెనీలోనే జవాను పని చేయడానికి మనసొప్పలే. ముందరే

నేనొద్దంటే పెద్దాయన వొల్లగాదని ఈ పని చేశాడు ఇప్పుడు మీరిట్టా జేశారు. ఇంత వొయిసొచ్చింది. ఇప్పుడేం జెయ్యనెలా బతకను అని ఏడిచాడు దీనంగా.

కొత్తనీరొచ్చి పాత నీర్ని గొట్టేసినట్టయిం దాడిపని చివరికి. జీతం డబ్బులు చేతబెట్టి పొమ్మన్నారు. ఇంటికెల్దావంటే మనసొప్పలేదు. అసలే లోకువ, పైగా జవాను పని చేసొచ్చానంటే వొంశానికే అవమానమయిందని పొమ్మంటారు.

రెడ్డి ఆ వీధిన పడి కొంపకి బయలుదేరాడు, ఏం జేదారా అని ఆలోచిస్తూ. ఆ రోడ్డు శానా పెద్దది; శానా కంపెనీలూ, దుకాణాలూ, ఇళ్ళూ ఉన్నాయి. అట్టా అయ్యీ యియ్యీ జూస్తూ రాగా రాగా రెడ్డికి సిగరెట్టు కాల్చబుద్దేసింది. జేబులో లేవు. కొందామని జూశాడు. కొట్టెక్కడా లేదు. అలా వెతుకుతూ వెతుకుతూ అరమైలు దూరం నడిచాడు. ఎక్కడా కిళ్ళీకొట్టు కనబళ్ళే.

అమాంతంగా రెడ్డికో ఉపాయం దోచింది. నాలాగా ఈ రోడ్డు నొచ్చే వాళ్ళెంతమందికో సిగరెట్టు కావలసుంటది. అళ్ళంతా ఏటిజేస్తన్నారూ. అలాటాళ్ళ కిక్కడ దుకాణవెడితే బాగుండదా అని తోచింది. అంతే ఆ జీతం డబ్బుల్తో సిగరెట్లు చుట్టలు బీడీలు కిళ్ళీలు గట్రా కసిని కసిని గొని ఓ జంగిడికెత్తి రెండు రవుండ్లు గొట్టాడు ఆ వీధిలో. మద్దినాళకే అమ్ముడయ్యాయి. వెంటనే మళ్ళీ జంగిడి సరుకెత్తి మళ్ళీ దిరిగాడు. సాయంత్రానికే సరుకయిపోయింది. నాలుగు రూపాయలు లాభం మిగిలింది. మర్నాడూ అలాగే జేశాడు. తరవాత ఓ పెద్దకంపెనీ అయన్ని బతిమాలి వీదరుగు మీద చోటు సంపాయించి దుకాణం బెట్టాడు. తనక్కడ కూర్చుని, మళ్ళీ జంగిడికి సరుకెత్తి ఓ కుర్రాడిచేత అమ్మించాడు. నాలుగు రోజుల్లో ఆ వీధిని రెండో చివర కూడా చిన్న దుకాణం బెట్టాడు.

సుబ్బరాజా, చెబితే చాలా వుంది గాని అవసరం లేదు. ఇలా మెల్లిగా కాళ్నిలదొక్కుకుని వ్యాపారం బాగు చేసుకున్నాడు. చురుకైన బుద్దేమో పదిరకాల వ్యాపారాల్లో దిగి పదిందాల డబ్బు గడించాడు. పొగాకుల్లో బాగా గడించాడనుకో. చెప్పొచ్చింది – పదేళ్ళయేసరికి లక్షాధికారయ్యారుకున్నాడు. యాపారం వృద్ధికి రావడానికి దానధర్మాలు ఎంత ముఖ్యమో దెలిసినవాడు గాబట్టి అయీ ఓ రకం పన్నులే అన్నట్టుగా డబ్బు వెదజల్లాడు. క్రమంగా పేరూ పలుకుబడీ వచ్చాయి. రాజకీయాల్లోకి దిగాడు, అక్కణ్ణించి సిరితోబాటు దశా అందుకుంది. ఎమ్మెల్యే అయ్యాడు. ఊరూరా పేరు మారుమ్రోగింది. పేరు మ్రోగిన చోటల్లా యాపారం ఊడలు దింపింది. రాజకీయ వ్యాపారంలో కూడా డబ్బు తిప్పాడు. రెండూ చెట్టాపట్టాలేసుకు పెరిగాయి. అంతటి గట్టివాడతనే అనిపించుకున్నాడు రెండిటా.

ఒకనాడు ఒక పెద్ద సవస్థకి రెడ్డిగారు పెద్ద చందా – చందా కాదు విరాళం అనాల్లే – విరాళం ఇచ్చాడు. లక్ష రూపాయలు. సరిగ్గా ఆనాటికే ఆయనని కొత్త మంత్రివర్గంలో మినిస్టరుగా తీసుకున్నట్టు పత్రికలో వార్త వచ్చింది. ఇహ చూసుకో.... ఆనాటి సభ అనుకున్నదానికన్నా మరింత జోరుగా జరిగింది. ప్రజ విరగబడి వచ్చింది.

దానం పుచ్చుకుంటున్న సవస్థ అధ్యక్షుడు (ఎవరనుకున్నా సరే) రెడ్డిగారిని ఆకాశాని కెత్తేశాడు. ఆగర్భ శ్రీమంతుడన్నాడు. అందాల రాజన్నాడు. బృహస్పతో ఆడెవడో అన్నాడు. చాణుక్యుడన్నాడు. చంద్ర గుప్తుడన్నాడు. తిమ్మరుసవుతాడన్నాడు... పది కంపెనీలు పెట్టి పది మందికీ ఉపాధి చూపి అన్నం బెట్టాడన్నాడు. అదేగాక

ఇలా బీదాబిక్కికీ సవస్థలకీ చేతి కెమిక లేకుండా దానాలిస్తున్నాడన్నాడు. ఇహ పొగళ్ళేక ఆయాసమొచ్చి ఆపేసి నమస్కారం బెట్టాడు. చెక్కు అందుకున్నాక ఆ సవస్థ తాలూకు పుస్తకం దెచ్చి - అందులో గొప్పవాళ్ళ చేత మంచి రిమార్కులు రాయించి చేవ్రాళ్ళు బెట్టిస్తారులే - అద్దెచ్చి అందులో తమరి ఆశీర్వచనం రాసి చేవ్రాలు పెట్టవలసిందని ఎదరబెట్టాడు.

రెడ్డిగారు మాటాళ్ళేదు. పుస్తకం వంక పరీక్షగా జూశాడు. తలొంచుకున్నాడు. కళ్ళు చెమ్మగిల్లాయి. చివరికి ధైర్యం తెచ్చుకుని లేచి నిలబడి సభా వందనం చేసి 'అయ్యా మీకు దెలుసో తెలీదో గాని మీ వూళ్ళో శానా మందెరుగుదురు - నాకు చదువు రాదు. బొత్తిగా రాదు' అనేసి కూర్చున్నాడు.

అధ్యక్షుడు నిర్ఘాంతపోయాడు. సరసమేమోనని నవ్వి జూచాడు. కాని తేలిపోయింది. అంతలో అనుమానమొచ్చి ఆ చెక్కు తీసి చూసి "మరి ఇదో? ఇందుమీద సంతకమెలా బెట్టారు?" అన్నాడు.

"సంతకానిక్కావలసిన పాటి అక్షరమ్ముక్కలు నేర్చుకున్నాను - చెక్కుల కోసమని, తప్పదు గదా" అన్నాడు రెడ్డిగారు.

సభ నిశ్శబ్దమయి పోయింది. అంతా చిన్నబుచ్చుకున్నారు. అధ్యక్షుడికేమీ పాలుపోలే. మొహం చెల్లదనుకున్నారు. అంతలో అతనికి ఉపాయం దోచింది - ఈ అవమానకర స్థితి నుంచి బయటపడ్డానికి.

"ఆహా, సభాసదులారా! ఇది మన శ్రీ రెడ్డిగారి మేధస్సుకు మరొక గొప్ప జోహారు. బొత్తిగా ఏమీ చదువుకోకుండానే వారు ఇంతవారై ఇన్ని లక్షలు ఆర్జించి ఇంత దానమిచ్చి మనకి పరిపాలకుడయ్యాడు గదా!

ఆహా శ్రీవారే గనక చిన్నతనంలో ఆయొక్క చదువు కూడా చదువుకుని ఉంటే ఇంకెంత వారయ్యేవారో గదా!" అన్నాడు.

సభలో అందరూ తేరుకొని, తప్పట్లు కొట్టారు. జైజైలతో ఓహోలతో సభ మారుమోగిపోయింది. రెడ్డిగారు చిరునవ్వు నవ్వి మరలా సభావందనం చేశారు జేసి, చిన్న ముక్కోటన్నారు.

"అదలాగుంచు. నువ్వు జెప్పు సుబ్బరాజూ. ఆయన గనక చిన్ననాడు చదువుకు నుంటే ఎంతవాడై ఉండేవాడు? అఖిల భారత నాయకుడా? ఐక్యరాజసమితిలో అధ్యక్షుడా? ఇండియా ఆర్థికమంత్రా? ప్రెసిడెంటా? ఏమయ్యేవాడు?" అన్నాడు రెడ్డిగారు ఆపి.

సుబ్బరాజు నవ్వాడు.

"ఏ వీ అయేవాడు గాదు. చదువుకొనుంటే అల్లా ఉజ్జోగం దీసేసిన సెట్టి కంపెనీలో ఉద్యోగం ఊడేదే గాదు. అప్పట్నుంచీ అటెండరుగా ఉండేవాడు. మహాయితే గుమాస్తా అయ్యేవాడు" అన్నాడు.

రామిరెడ్డి మందహాసం చేసి "సరే నువ్వెళ్ళిరా" అన్నాడు.

(ఇదేదో ఇంగిలీషు కథకి పచ్చి కాపీ అంటే మీమాటే రైటు - సోమర్సెట్ మాఘం కథకి!)

★ ★ ★